సొంతింటి కల సాకారం

- తూర్పులో 3,212 మందికి టిడ్కో ఇళ్ల కేటాయింపు
- ఆకర్షణీయంగా పెదజాలరిపేట టిడ్కో ఆదర్శగ్రామం
- 24,560 మందికి ఇళ్ల స్థలాల మంజూరు
- జగనన్న ప్రభుత్వంపై లబ్ధిదారుల హర్షాతిరేకాలు



పెదజాలరిపేటలో నిర్మించిన ఆదర్శ గ్రామం



దబ్బందలోని టిడ్కో ఇళ్ల సముదాయం

ఎంవీపీ కాలనీ: దశాబ్దాలుగా తూర్పు నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్న సొంతింటి కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషితో సాకారమైంది. టిడ్కో ఇళ్లు, సెంటు ఇళ్ల స్థలాల కేటాయింపును సీఎం వైఎస్ జగన్ సర్కారు పూర్తి చేయడంతో ప్రభుత్వంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెదజాలరిపేటలో నిర్మించిన టిడ్కో 'ఆదర్శగ్రామం'తో పాటు దబ్బందలో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయంలో పెద్ద ఎత్తున తూర్పు వాసులకు కేటాయింపులు జరిగాయి. నియోజకవర్గం పరిధిలో 3,212 మందికి టిడ్కో ఇళ్లు కేటాయించగా, 24,560 మంది వన్ సెంట్ ఇళ్ల స్థలాలు పొందారు. టిడ్కో ఇళ్ల కేటాయింపులతో పాటు ఎలక్ట్రికల్, వాటర్ కనెక్షన్, యూజీడీ వ్యవస్థలతో కూడిన సకల సౌకర్యాలను ప్రభుత్వం లబ్ధిదారులకు కల్పించింది.

తూర్పులో 3,212 మంది లబ్ధిదారులు

తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3,212 మందికి టిడ్కో ఇళ్లు కేటాయించారు. వీరిలో జోన్–3 పరిధిలో 2,743 మంది, జోన్–2 పరిధిలో 469 మంది లబ్ధిదారులు ఉన్నారు. 300 ఎస్ఎఫ్టీ, 365 ఎస్ఎఫ్టీ, 420 ఎస్ఎఫ్టీ కేటగిరీల్లో లబ్ధిదారులకు ఫ్లాట్లు మంజూరు చేశారు. ఒక్కో ఫ్లాట్‌కు ఎస్ఎఫ్టీ ప్రకారం రూ.5.65 లక్షల నుంచి రూ.7.65 లక్షలు ఖర్చు అవుతుండగా రూ.2.64 లక్షల నుంచి రూ.3.65 లక్షల వరకు బ్యాంకు రుణంగా ప్రభుత్వం సమకూర్చింది. ఆయా జోనల్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది లబ్ధిదారులకు రుణ సదుపాయం కల్పించడంలో ప్రత్యేక భూమిక పోషించారు.

రూ.9 కోట్లతో ఆదర్శగ్రామం

పెదవాల్తేర్ జాలరిపేటలో ఆదర్శగ్రామం పేరిట నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించారు. 5 బ్లాకులుగా నిర్మించిన ఈ ఆదర్శ గ్రామంలో 120 మందికిపైగా లబ్ధిదారులకు కేటాయింపులు చేశారు. రూ.9 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు 365 ఎస్ఎఫ్‌టీలో హాల్, కిచెన్, బెడ్ రూమ్ విత్ అటాచ్డ్ బాత్‌రూమ్‌తో అత్యంత ఆధునికంగా ఈ ఇళ్ల నిర్మాణం జరిగింది. పిల్లర్స్‌తో పాటు గోడలు సైతం పూర్తిగా కాంక్రీట్‌తో నిర్మాణం చేశారు. యూజీడీ వ్యవస్థ, విద్యుత్, వాటర్ సరఫరాను ఇళ్ల ప్రారంభోత్సవానికి ముందే అందుబాటులోకి తెచ్చారు.



ప్రజలకు టిడ్కో ఇళ్ల మంజూరులో ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి(ఫైల్)

డబ్బులు తీసుకుని దగా చేసిన టీడీపీ



తూర్పు నియోజకవర్గ ప్రజల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ఇళ్లు, ఇళ్ల స్థలాల మంజూరుకు గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయలేదు. టీడీపీ ప్రభుత్వం తూర్పు ప్రజలను ఎప్పటికప్పుడు దగా చేస్తూ వచ్చింది. ఇళ్ల కేటాయిస్తామంటూ నియోజకవర్గంలో వేలాది మంది పేదల దగ్గర రూ.25 వేలు డబ్బులు కట్టించుకుని కేటాయింపులు చేయకుండా మోసం చేశారు. అయితే సీఎం జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కేటాయింపులు చేసి పేదల కల నెరవేర్చింది. ఇందుకు సీఎం జగన్‌కు తూర్పు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త

జగనన్న ప్రభుత్వంతోనే సాధ్యమైంది

దశాబ్దాలుగా అద్దె ఇంట్లోనే కుటుంబం అంతా జీవనం సాగిస్తున్నాం. చాలా కాలంగా ప్రభుత్వం అందించే ఇల్లు కోసం ఎదురుచూస్తున్నాం. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గతంలో ఇల్లు సాకారం కాలేదు. సీఎం జగన్ చొరవతోనే మాకు ఇళ్ల కేటాయింపులు సాధ్యమయ్యాయి.

– బైపల్లి ఎర్రమ్మ, టిడ్కో ఇల్లు లబ్ధిదారు

సీఎం పేదలకు అండగా నిలిచారు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదలకు అండగా నిలిచారు. ఈ ప్రభుత్వంలో పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి జరుగుతోంది. పెన్షన్స్, సంక్షేమ పథకాల ద్వారా పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. అర్హత ఉన్నప్పటికీ చాలా కాలంగా మాకు ఇల్లు మంజూరు కాలేదు. ప్రస్తుతం జగన్ ప్రభుత్వం అన్ని రకాల అనుమతులతో, సౌకర్యాలతో కేటాయింపులు చేశారు. పేదలను అన్ని రకాలుగా ఆదుకుంటున్న సీఎం అండగా ఉంటాం.

– పవన్‌కుమార్, టిడ్కో ఇల్లు లబ్ధిదారు

క్లుప్తంగా

ఎంవీపీలో షణ్ముఖశర్మ ప్రవచనాలు



ప్రవచనాలు చేస్తున్న షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ: సామవేదం షణ్ముఖశర్మ హనుమద్వైభవ ప్రవచనాలు గురువారం ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా ప్రారంభమయ్యాయి. షణ్ముఖశర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు చేశారు. వేదాంగ జ్యోతిష్య నిపుణులు కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా షణ్ముఖ శర్మ మాట్లాడుతూ రామ చరిత మానసం, హనుమాన్ చాలీసా, హనుమ దష్టకం, హనుమాన్ బాహుక్ తదితర రచనలను తులసీదాస్ రచించారన్నారు. హనుమంతుని అనుగ్రహంతో, రామ నామ తారక మంత్రంతో మాత్రమే రామ సాక్షాత్కారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా రత్నమాల బృందం ఆలపించిన భక్తిగీతాలాపన అందరినీ అలరించింది.

'నాణ్యతతో రోడ్డు నిర్మాణం'

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో పలు ప్రధాన రహదారుల మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు గురువారం నేతాజీ నగర్‌లో జీవీఎంసీ నిర్మిస్తున్న రోడ్డు పనులను పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు.

3 కేజీల గంజాయి స్వాధీనం

బీచ్ రోడ్డు: అక్రమంగా తరలిస్తున్న 3 కేజీల గంజాయిని టాస్క్‌ఫోర్సు, మూడో పట్టణ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. మూడో పట్టణ పోలీసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన సీతాల్, మధుసూదన్ రామా టాకీస్ ఎదురుగా గంజాయి తరలిస్తున్నారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు సిబ్బంది, పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో మూడు కేజీల గంజాయితో పాటు రెండు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

పోతన్న దహన సంస్కారాలకు రూ.10వేల సాయం



డీఆర్వో మోహన్‌కుమార్‌తో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

మహారాణిపేట: మృతి చెందిన రిమాండ్ ముద్దాయి కోడా పోతన్న దహన సంస్కారాలకు జిల్లా యంత్రాంగం రూ.10 వేల ఆర్థిక సాయం చేసింది. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ గురువారం అతని భార్యకు ఈ మొత్తం చెక్కును అందజేశారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టి, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, బీఎస్పీ నాయకుడు బోని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మాఘ మాసోత్సవాలు

అల్లిపురం: వెంకటేశ్వర మెట్టపై వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో ఈ నెల 10 నుంచి మాఘ మాసోత్సవాలు ప్రారంభమవుతాయని అక్కడి అలిమేలు మంగమ్మ అమ్మవారి దేవాలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు మాఘ స్నానాలు ఆచరిస్తారన్నారు. ఈ నెల 11, 18, 25, మార్చి 3, 10 తేదీల్లో ఐదు మాఘపు ఆదివారాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ నెల 16న రథసప్తమిని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయన్నారు. 20న భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు.

పథకాలపై ప్రచారం.. పేదలతో సహపంక్తి భోజనం

- ఎంపీ ఎంవీవీ పాదయాత్రకు నీరాజనం
- 19వ వార్డులో విస్తృత పర్యటన



మత్స్యకార నాయకులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర గురువారం 19వ వార్డులో కొనసాగింది. ప్రజల నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా ఈ యాత్ర సాగుతోంది. ఈ యాత్రలో భాగంగా ఎంపీ ఎంవీవీ 34వ రోజు 19వ వార్డులోని పెదజాలరిపేటలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మితో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. మత్స్యకార నాయకులతో ఎంవీవీ మమేకమై సహపంక్తి భోజనం చేశారు. ఆ ప్రాంతంలో సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల మతాలు, పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు వందశాతం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరాడ దాసుతో పాటు పలువురు నాయకులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు యువశక్తి సదస్సు



మాట్లాడుతున్న పల్సస్ సీఈవో గేదేల శ్రీనుబాబు

సీతమ్మధార: ఈ నెల 9న విశాఖ గురజాడ కళాక్షేత్రంలో యువశక్తి సదస్సు నిర్వహించనున్నట్లు పల్సస్ సీఈవో గేదేల శ్రీనుబాబు తెలిపారు. ఆశీలమెట్టలోని ఒక హోటల్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు 10 వేల మంది హాజరు కానున్నారని, దీనిని జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రైతులు తమ పంటను తామే మార్కెటింగ్ చేసుకునేందుకు, విద్యార్థులు తమ కాళ్లపై తామే నిలబడేందుకు అనుసరిస్తున్న విధానాలపై సదస్సులో నిపుణులు వివరిస్తారని చెప్పారు. విభిన్న రంగాల పరిశ్రమలను ఆకర్షించడం, ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడం ద్వారా అద్భుత ఆర్థిక వృద్ధికి బాటలు వేయవచ్చన్నారు. డిజిటల్ విప్లవం కోసం నేటి యువతను సిద్ధం చేయడం ద్వారా రాష్ట్ర ప్రగతి, ఆర్థిక శక్తిగా లక్ష్యాలను చేరుకునేందుకు మార్గం ఏర్పడుతుందని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి 2 కోట్ల మందికి చేరువవుతామని చెప్పారు. నేటి విద్యార్థులే రేపటి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నదే తమ లక్ష్యమన్నారు. నగరంలో 2.25 లక్షల మంది ఉద్యోగులుంటే, మరో 8 లక్షల మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని, భవిష్యత్తులో వారందరికీ ఉపాధి కల్పించే దిశగా యోచిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్యాన్సర్‌కు కార్ టీ–సెల్ థెరపీ చికిత్స



మీడియాతో మాట్లాడుతున్న అపోలో సీవోవో రామచంద్రరావు

అరిలోవ: స్థానిక హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్‌కు అత్యాధునికమైన కార్ టీ–సెల్ థెరపీ చికిత్స అందుబాటులో ఉందని ఆస్పత్రి సీవోవో రామచంద్రరావు తెలిపారు. ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో గతేడాది తొలిసారిగా కార్ టీ–సెల్ థెరపీ ముంబయి అపోలో ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా విశాఖ అపోలో ఆస్పత్రిలో బుధవారం 45 ఏళ్ల మహిళకు ఈ చికిత్స చేశామన్నారు. హిమటో అంకాలజిస్ట్ డాక్టర్ రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ బీ–సెల్ లింపోమాస్, అక్యూట్ లింపోబ్లాస్టిక్ లుకేమియాతో బాధపడుతున్న వారికి ఈ విధానంలో చికిత్స అందిస్తామన్నారు. క్యాన్సర్ బాధితుల నుంచి రక్త కణాలు బయటకు తీసి వాటిని రీ యాక్టివేట్ చేస్తామన్నారు. మళ్లీ వాటిని ఆ రోగిలోకి ప్రవేశపెడతామని తెలిపారు. దీని ద్వారా ఆ రోగి పూర్తిస్థాయిలో కోలుకుంటారని, ఇది అత్యాధునిక విధానమని తెలిపారు. పాశ్చాత్య దేశాల్లో ఈ చికిత్సకు రూ.4 కోట్ల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఇక్కడ రూ. 50 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారికి త్రికాల పంచామృతాభిషేక సేవ చేశారు. రూ.1,500 రుసుం చెల్లించి సహస్ర తులసీదళార్చనలో, రూ.1,000 రుసుం చెల్లించి త్రికాల పంచామృతాభిషేక సేవలో భక్తులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'యాత్ర–2' థియేటర్ల వద్ద సందడి



తీన్మార్ బృందంతో సందడి చేస్తున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు



సినిమాను వీక్షించడానికి వస్తున్న జీవీ, తదితరులు

మద్దిలపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయోపిక్‌గా వచ్చిన యాత్ర–2 చిత్రాన్ని ప్రదర్శిస్తున్న థియేటర్ల వద్ద గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు సందడి చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. సగటు ప్రేక్షకుడి హృదయాన్ని కదలించేలా చిత్రం ఆకట్టుకుందని నాయకులు తెలిపారు. ఈ చిత్రాన్ని మద్దిలపాలెం కిన్నెర–కామేశ్వరి థియేటర్లలో గురువారం ప్రదర్శించారు. నియోజకవర్గానికి చెందిన 500 మంది ఈ చిత్రాన్ని వీక్షించారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పార్టీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, జీవీ, తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు సినిమాను తిలకించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ రాజకీయ చదరంగంలో ఒంటరిగా పోరాడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీరును, సాధించిన విజయం, ప్రజా సంక్షేమానికి చేసిన సేవలను చిత్రంలో ఎంతో చక్కగా చూపించారన్నారు. కొన్ని సన్నివేశాలు మనస్సును హత్తుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బి.శివరామకృష్ణ, నగర మహిళా అధ్యక్షురాలు కృపా జ్యోతి, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై అవగాహన అవసరం



తెలుగు జర్నలిస్టులకు శిక్షణ ఇస్తున్న కౌశిక్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అమెరికన్ కార్నర్ ప్రాంగణంలో అమెరికన్ కాన్సులేట్ జనరల్ సహకారంతో వ్యూఫ్ స్వచ్ఛంద సంస్థ వాతావరణ మార్పులపై గురువారం తెలుగు జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పర్యావరణ, వాతావరణ మార్పుల దుష్ప్రభావాలపై అవగాహన అవసరమని వ్యూఫ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.బీమారావు చెప్పారు. తెలుగు ప్రాంతీయ భాషా జర్నలిస్టులు వాతావరణ మార్పులపై మరింత కచ్చితమైన, సమగ్రంగా సమాచారం అందించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. వర్క్‌షాప్‌లో మొదటి రోజున క్లైమేట్ ఆసియా సంస్థ(బెంగళూరు) ప్రతినిధి కౌశిక్ యనమండ్రం మాట్లాడుతూ పర్యావరణ మార్పుల దుష్ప్రభావాలు, వాటిని ఎదుర్కోవడంలో స్థానిక సమూహాలు, సవాళ్లు, పరిష్కారాల అంశాలపై అవగాహన కల్పించారు. టైమ్స్ ఆఫ్ ఇండియా జర్నలిస్టు జె.ఉమామహేశ్వరరావు వాతావరణ మార్పులు, కీలక సమాచార పరిశోధన, సేకరణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని యుఎస్ కాన్సులేట్ ప్రతినిధి అబ్దుల్ సమద్, వ్యూఫ్ ప్రతినిధి సునీల్ కుమార్ ఘదేల్, రాష్ట్రంలోని పలు మీడియా సంస్థలకు చెందిన 30 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సంపూర్ణ ఆరోగ్యం



ఆరిలోవ కాలనీలో సురక్ష శిబిరంలో ఓపీ నమోదు చేయించుకొంటున్న స్థానికులు



మందులు అందజేస్తున్న యూపీహెచ్‌సీ వైద్యాధికారి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గంలో జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ యూపీహెచ్‌సీలో గురువారం వైద్య ఆరోగ్య శాఖాధికారులు జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మలేరియా, టీబీ మందులతో పాటు, అంగన్‌వాడీ పిల్లలకు నిత్యం పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాలను ప్రదర్శించారు. శిబిరానికి వెళ్లిన స్థానికలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. ఓపీ కౌంటర్, మందులు పంపిణీ చేసే కౌంటర్, కన్సల్టెన్సీ చాంబర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆరిలోవ కాలనీ, ఆపరేషన్ కాలనీ, కనకమహాలక్ష్మి నగర్, నలబై గజాల రోడ్డు, దుర్గాబజార్, పాండురంగాపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 310 మంది ఈ వైద్య సేవలు పొందారు. 188 మందికి సాధారణ వైద్యం, 42 మందికి కంటి పరీక్షలు, 30 మందికి దంత పరీక్షలు, 50 మందికి గైనిక్ పరీక్షలు చేశారు. యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ శ్రేష్ట, వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల సత్యనారాయణ, వైద్య సిబ్బంది రోగులకు అవసరమైన మందులు అందజేశారు. ఇంటి దగ్గరలో వైద్య సేలు అందించడంపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఏయూ సమాచారం

ప్రతీ విభాగం ప్రగతి సాధించాలి



బీవోఎస్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రతి విభాగం ప్రగతిలో భాగం కావాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. గురువారం ఉదయం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన బీవోఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విభాగంలో ఆచార్యులు సాధించిన అవార్డులు, పేటెంట్లు, వారు పాల్గొన్న జాతీయ, అంతర్జాతీయ సదస్సులు వంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు విభాగాల వారీగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఒక ప్రత్యేక విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇలా చేస్తే విభాగ స్థాయి నుంచి విశ్వవిద్యాలయం వరకు అభివృద్ధికి సంబంధించిన సమగ్ర సమాచారం ఒక డాక్యుమెంట్ రూపంలో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం నాక్ సన్నద్ధత జరుగుతుందన్నారు. ఏడేళ్ల తరువాత నాక్ స్కోర్ కనీసం 3.8 గ్రేడ్ పాయింట్ల కంటే అధికంగా సాధించే లక్ష్యంతో విభాగాలలో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీలో ఏటా ఇంటర్నల్ ఆడిట్ చేయడం, నాక్‌కు సమాచారాన్ని సిద్ధం చేయడం ఎంతో ప్రధానమన్నారు. అనంతరం పలు అంశాలపై సభ్యులు చర్చించి, సూచనలు స్వీకరిస్తూ, నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాళ్లు, బీవోఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీఏ హాస్పిటాలిటీ మూడో సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఏయూ ఐఏఎస్ఈ భవనంలో జరుగుతున్న పరీక్షలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి నింబస్ యాప్ సేవలు



నింబస్ సేవలు ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో ఈ–రిసోర్సెస్‌ని విద్యార్థులకు అందుబాటులో ఉండేలా కొత్తగా నింబస్ ఎం లైబ్రరీ మొబైల్ యాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో నింబస్ యాప్ సేవలను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభించారు. విభిన్న డిజిటల్ రిసోర్సెస్‌ని విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు ఉపయుక్తంగా నిలిపేలా ఈ సేవలు దోహదపడనున్నాయి. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేకంగా హాస్టళ్లలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య టి.శోభశ్రీ, కె.విశ్వేశ్వరరావు, ఆచార్య వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బైక్, సైకిల్ దగ్ధం
- చెలరేగిన మంటలు



అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో చెలరేగుతున్న మంటలు



దగ్ధమైన ఎలక్ట్రికల్ బైక్, సైకిల్

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజునగర్‌లోని అపూర్వ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో పెను ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు.. అపూర్వ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న వ్యక్తి తన ఎలక్ట్రికల్ బైక్‌కు చార్జింగ్ పెట్టి సొంత పనిమీద బయటకు వెళ్లాడు. సాయంత్రం 7.30 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ద్విచక్రవాహనం నుంచి మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న విద్యుత్ ప్యానల్ బోర్డుతో పాటు సోఫాకు మంటలు అంటుకోవడంతో భారీగా చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు, అపార్ట్ మెంట్ వాసులు అప్రమత్తమయ్యారు. బైక్ సమీపంలో ఉన్న పలు ద్విచక్రవాహనాలను పక్కకు తొలగించారు. ఇంతలో సమాచారమందుకున్న మర్రిపాలెం ఫైర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంతో పాటు అపార్ట్‌మెంట్ విద్యుత్ ప్యానల్ బోర్డు, వాచ్‌మెన్‌కు సంబంధించిన సోఫా, సైకిల్ దగ్ధమయ్యాయి. ద్విచక్రవాహనాలను తొలగించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంతో అపార్ట్‌మెంట్ వాసులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మర్రిపాలెం ఫైర్ అధికారి కేవీటీ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని తెలిపారు.